క్లుప్తంగా

మావుళ్లమ్మ సేవలో సినీ దర్శకుడు పూరీ కుటుంబం


పంచారామక్షేత్రంలో పూరీ జగన్నాథ్ కుటుంబ సభ్యులు

భీమవరం(ప్రకాశం చౌక్) : భీమవరం ఓ ప్రైవేట్ కార్యక్రమానికి విచ్చేసిన సినీ దర్శకులు పూరీ జగన్నాథ్ భార్య లావణ్య, కుమార్తె పవిత్ర పలు ఆలయాలను దర్శించుకున్నారు. పట్టణంలోని శ్రీమావుళ్లమ్మ అమ్మవారిని, పంచారామక్షేత్రం శ్రీఉమాసోమేశ్వరస్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈకార్యక్రమంలో ఆయా ఆలయాల ధర్మకర్తలు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


జువ్వలపాలెంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

కాళ్ల: బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జువ్వలపాలెం జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఎత్తు, బరువు, హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. సుమారు 180 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బైర్రాజు ఫౌండేషన్ గ్రామ వికాస సమితి కన్వీనర్ జి.వినోద్ రంగరాజు, హైస్కూల్ హెచ్‌ఎం టి.త్రినాథ్, ఉపాధ్యాయులు భాస్కరవర్మ, శ్రీనివాస్, బైర్రాజు ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ ఎంఆర్ రాజు, పెనుమాక భానుమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీపద్దాల వెంకమ్మ జాతర


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి

వీరవాసరం : రాయకుదురులో సోమవారం శ్రీపద్దాల వెంకమ్మ జాతర మహోత్సవం నిర్వహించారు. మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవార్ల గరగత్సోవం వేడుకగా చేపట్టారు. నృత్యాలతో ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, సర్పంచ్ గెద్దం భారతి, మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నివాసాల చెంత చెరువులకు అనుమతులు ఇవ్వొద్దు

కాళ్ల: ఏలూరుపాడులో గాంధీబజారుకు అనుకుని చేపల చెరువుల తవ్వకాలకు అనుమతులు ఇవ్వద్దంటూ గ్రామానికి చెందిన కొండపల్లి మోహనరావు సోమవారం స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. గాంధీ బజారులోని సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో చెరువుల తవ్వకాలకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆ భూములు నివాసాలకు అనుకుని ఉన్నాయని వివరించారు. చెరువుల తవ్వకాలకు అనుమతి ఇస్తే తాగునీటి సమస్య, భూగర్భ జలాలు ఇంకిపోతాయని, అధికారులు తక్షణం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనితోపాటు కాళ్లకూరు గ్రామంలో ఆక్వా చెరువుల నీరు పంటబోదెల్లోకి వదిలేస్తుండటంతో మంచినీరు కలుషితం అవుతోందని, చర్యలు తీసుకోవాలంటూ స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే పెదఅమిరం గ్రామంలో భూమి సర్వేకు సంబంధించి మరొక ఫిర్యాదు అందినట్లు తహసీల్దార్ కృష్ణారావు చెప్పారు.

సామాజిక న్యాయం జగన్‌తోనే సాధ్యం


బడుగు బాలజీ

ఉండి: సామాజిక న్యాయం అనే పదానికి తగిన న్యాయం చేస్తున్న ఒకే ఒక్క ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బడుగు బాలాజీ అన్నారు. సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు తగిన న్యాయం చేయడం సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమన్నారు. సోమవారం ప్రకటించిన 18 ఎమ్మెల్సీ స్థానాలకు గాను 11 బీసీలకు, 2 ఎస్సీలకు, ఒకటి ఎస్టీలకు కేటాయించడం హర్షించదగ్గ పరిణామమన్నారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలంతా ముఖ్యమంత్రి వెంటే ఉన్నారని, ఇకముందు కూడా ఉంటారన్నారు. 2024లో జరిగే సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అన్ని సామాజికవర్గాల అండదండలతో, వారి ఆశీస్సులతో 175 స్థానాల్లోను క్లీన్ స్వీప్ చేసి గెలిచి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు.

ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు వైఎస్సార్ సీపీదే

- భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్
- సమన్వయంతో పనిచేయాలని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం : ఎన్నికల్లో ప్రజలకిచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నందున్న వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతిక హక్కు వైఎస్సార్ సీపీకే ఉందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ స్పష్టం చేశారు. భీమవరం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో సోమవారం ఏర్పాటుచేసిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల మన్ననలు, దేవుని ఆశీస్సులతో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బ్రహ్మాండమైన మెజార్టీతో అధికారంలోకి వస్తుందని ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, భీమవరం ఎమ్మెల్యేగా తాను అధికారం చేపట్టడం ఖాయని శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. గడిచిన మూడున్నర ఏళ్లలో 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతానికి పైగా అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజలను వంచించడంలో పేరొందిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆయనకు వంతపాడుతున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే హక్కు లేదన్నారు. ప్రజాబలంలేని పవన్ కళ్యాణ్ రానున్న ఎన్నికల్లో ఎక్కడ నుంచి పోటీచేసినా ఘోర పరాభవం తప్పదని శ్రీనివాస్ స్పష్టం చేశారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబునాయుడు 600 హామీలిచ్చి ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చారని వాటిలో ఒక్క హామీని నెరవేర్చలేకపోవడంతో 2019 ఎన్నికల్లో ప్రజలు తరిమికొట్టారన్నారు. ప్రజలు ఛీత్కరించినా చంద్రబాబులో ఎటువంటి పశ్చాత్తాపం లేదన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో టీడీపీ, జనసేన పోటీచేసినా వైఎస్సార్ సీపీ విజయాన్ని నిలువరించడం ఎవరి తరం కాదన్నారు. ప్రజలంతా మనకు మద్దతుగానే ఉన్నారని వారందరినీ సమన్వయం చేయాల్సిన బాధ్యత గృహసారథులు, సచివాలయ కన్వీనర్లపై ఉందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు సమన్వయంతో ముందుకెళ్లి ప్రజలకు వివరించడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వంపై చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ చేస్తున్న కుట్రలు, కుతంత్రాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గా నాగమల్లేశ్వరరావు(బాబు), భీమవరం మండలాధ్యక్షుడు పేరిచర్ల విజయ నర్సింహారాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నర్సింహారావు, జేసీఏ కన్వీనర్లు కోమటి రాంబాబు, చెల్లబోయిన సూర్యప్రకాష్, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోడె యుగంధర్, కొట్టి కుటుంబరావు, కోళ్ల బాలకృష్ణ, సోడ దాసి లలితకుమారి, ఆరేటి వీరవెంకట స్వామినాయుడు, నామన మహేష్, తేలి జోసఫ్ కుమార్, కలిదిండి ఫణిరాజు తదితరులు పాల్గొన్నారు.

డీఎన్నార్ పాలకవర్గ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ


ఎన్నికల షెడ్యూల్‌ను వెల్లడిస్తున్న రఘురామ్

సాక్షి, భీమవరం : భీమవరం డీఎన్నార్ కళాశాల పాలకవర్గ ఎన్నికలకు సోమవారం ఎన్నికల షెడ్యూల్ నోటిఫికేషన్ విడుదలైంది. కళాశాల ఎన్నికల అధికారి డాక్టర్ కె.రఘురామ్ ఎన్నికల షెడ్యూల్‌ను విలేకర్లకు తెలియజేశారు. ఐదేళ్లపాటు అధికారంలో ఉండే పాలకవర్గంలో పోటీ చేసే అభ్యర్థుల కోసం ఈనెల 24వ తేది ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్స్ ప్రతాలను కళాశాల అడ్మినిస్ట్రేటివ్ భవనంలో పొందవచ్చన్నారు. మార్చి 2, 3 తేదీల్లో నామినేషన్ల స్వీకరణ, 4న నామినేషన్ల పరిశీలన, 5, 6 తేదీల్లో నామినేషన్ల ఉపసంహరణకు గడువు, 7వ తేదీన పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా వెల్లడి, 24న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, ఆదేరోజు సాయంత్రం 4 గంటల నుంచి ఓట్లు లెక్కింపు ఉంటుందని ఎన్నికల అధికారి రఘురామ్ వెల్లడించారు. కళాశాలలో 4,774 మంది ఓటర్లు ఉండగా కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులతోపాటు 13 మంది సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఎన్నికైన సభ్యుల నుంచి మిలిగిన కార్యవర్గాన్ని ఎంపిక చేస్తారు. ఎన్నికల్లో పోలింగ్‌కుగాను 18 పోలింగ్ బూత్‌లను ఏర్పాటుచేయనున్నట్లు ఆయన చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా, సహజవుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్నికల అధికారి రఘురామ్ చెప్పారు.

స్పందనలో ఐదు ఫిర్యాదులు

ఆకివీడు: స్పందన కార్యక్రమంలో ఐదు ఫిర్యాదులు అందినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్ఎస్.శ్రీకర్ సోమవారం చెప్పారు. కరెంట్ డిపాజిట్ చెల్లించినప్పటికీ తన సర్వీస్ లోడ్ పెంచలేదని దాసి మైడాగ్రేస్ ఫిర్యాదు చేశారన్నారు. అదనపు లోడు చార్జీలు, డిపాజిట్లు వసూలు చేసినందున సర్వీస్ లోడును 2.6 కేవీ సరిజేయాలని పేర్కొన్నారని చెప్పారు. నగర పంచాయతీ పరిధిలో నిర్మించిన డైలీ మార్కెట్ ప్రాంత షెడ్లను వినియోగంలోకి తీసుకురావాలని వర్దినేని వీరవెంకట సత్య శ్రీరామచంద్రమూర్తి ఫిర్యాదు చేశారు. స్థానిక సాలిపేటలోని గాంధీ పార్కు వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ పెంచాలని సాంఘిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ డీవీ రమణమూర్తి ఫిర్యాదు చేశారని చెప్పారు. కోళ్లపర్రు గ్రామంలోని సర్వే నంబర్లు 438, 537/2, 470, 437లలో ప్రభుత్వ పోరంబోకు భూమిని సర్వే చేసి స్వాధీనం చేసుకోవాలని గ్రామానికి చెందిన కేఏస్‌జేవీ నర్సింహరావు ఫిర్యాదు చేశారు. కోళ్లపర్రులోని సర్వే నంబర్ 436, 386లలో చేపల చెరువును నూతల కోడు గట్టుకు చేర్చి చెరువు గట్టు తవ్వి రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నారని ఆ ప్రాంత రైతులు బీ.నాగరాజు, గండికోట ఏడుకొండలు, ఎన్.ఫణికుమార్, కె.సుబ్రహ్మణ్యం తదితరులు ఫిర్యాదు చేశారని, ఆయా ఫిర్యాదుల్ని పరిష్కారం నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు బదలాయించినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వివరించారు.

ఆదర్శ రాజకీయ నేత సర్రాజు

ఆకివీడు: అందరి మనస్సుల్లో మంచి ముద్ర వేసుకుని అందరివాడుగా క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు నిలిచిపోయారని రాజ్యసభ మాజీ సభ్యులు యర్రా నారాయణస్వామి కొనియాడారు. క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు ఆకస్మిక మృతి పట్ల సోమవారం కుటుంబ సభ్యుల్ని యర్రా పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కపటం లేని మనిషి సర్రాజు అన్నారు. అందరినీ గౌరవిస్తూ, ఆప్యాయంగా, మమకారంగా పలకరిస్తుండేవారని చెప్పారు. ఆయన మరణం తీరని లోటన్నారు. పేదల అభివృద్ధి కోసం తన శక్తికి మించి కృషి చేశారని యర్రా కొనియాడారు. సర్రాజు చిత్రపటానికి మాజీ మంత్రి ఇందుకూరి రామకృష్ణంరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఆదర్శవంతమైన రాజకీయ నాయకుడిగా సర్రాజు వెలుగొందారని చెప్పారు. పదవి కన్నా పేదల అభివృద్ధే మిన్నగా సేవలందించారని కొనియాడారు. సర్రాజు చిత్రపటానికి వైఎస్సార్ సీపీ యువ నాయకుడు చెరుకువాడ నర్సింహరాజు, వేగేశ్న జయ రామకృష్ణంరాజు, పెన్మెత్స ప్రసాదరాజు, భీమవరం క్షత్రియ పరిషత్ అధ్యక్షులు గాదిరాజు సుబ్బరాజు, సాగిరాజు హరివర్మ, డాక్టర్ నీలాద్రిరాజు, డాక్టర్ వేగిరాజు రామకృష్ణంరాజు, గాదిరాజు బాబు, అంబటి రమేష్, జగదీష్, చిక్కాల సుబ్బరాజు, అంకెం సీతారామ్, భీమవరం చాంబర్ అధ్యక్షులు కురిసేటి రాజా తదితరులు నివాళులర్పించారు. సర్రాజు కుమారులు శ్రీనివాసరాజు, వర్మలను పరామర్శించారు.


సర్రాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు చెరుకువాడ నర్సింహరాజు


సర్రాజుకు నివాళులు అర్పిస్తున్న కొపల్లె సొసైటీ అధ్యక్షుడు, ఉద్యోగులు

కల్మషం లేని నాయకుడు సర్రాజు

కాళ్ల: కల్మషం లేని రాజకీయ నాయకుడు సర్రాజును కోల్పోవడం నియోజవర్గానికి తీరని లోటని కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న జయరామకృష్ణంరాజు అన్నారు. కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న జయ రామ కృష్ణంరాజు, ఉద్యోగులు, సిబ్బంది, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి సర్రాజు మృతికి సోమవారం సంతాపం తెలిపారు. సర్రాజు నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలో వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు జయరామకృష్ణంరాజు మాట్లాడుతూ నియోజవర్గంతోపాటు కోపల్లె సొసైటీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. కోపల్లె సొసైటీ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో రైతుల అభివృద్ధికి సొసైటీ ద్వారా ఎనలేని సేవలు అందించారని అన్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ సొసైటీ సేవలందిస్తామన్నారు. వీరి వెంట సొసైటీ కార్యదర్శి ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

కాళ్ళ : క్షత్రీయ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి సర్రాజు మరణం జక్కరం గ్రామానికి తీరని లోటు అని అని గ్రామ ప్రజలు కన్నీరుమున్నీరయ్యారు. సోమవారం గ్రామస్తులు సర్రాజు నివాసానికి వచ్చి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామస్తులతో ఆయనది విడదీయరాని బంధమని అన్నారు. ఈ సందర్భంగా సర్రాజు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయన కుమారులు శ్రీనివాసరాజు, యుగంధర్ వర్మ కుటుంబీకులను పరామర్శించి తామంతా ఎప్పుడూ తోడుగా ఉంటామని ధైర్యం చెప్పారు.

దాడిపై కేసు నమోదు

పాలకోడేరు: పాత గొడవలను పురస్కరించుకుని తనపై కొంతమంది దాడి చేశారంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. నరసాపురంలోని 31వ వార్డుకు చెందిన రెండు వర్గాల వారికి పాత గొడవలు ఉన్నాయి. ఈ నెల 15వ తేదీన శృంగవృక్షం గ్రామంలో జరిగిన పెళ్లికి ఇరువర్గాలు హాజరయ్యాయి. రాత్రి పదిన్నర గంటలకు రిసెప్షన్ జరుగుతుండగా ఒక వర్గానికి చెందిన బళ్ల రమేష్ మరో ముగ్గురు కలిసి తనను చేతులతో కొట్టి చంపుతానని బెదిరించి అక్కడున్న ఆడవాళ్లను అసభ్యకరంగా సైగలు చేసి దాడి చేశారని అడబాల ఉమామహేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

అదనపు వరకట్న వేధింపులపై కేసు నమోదు

భీమవరం అర్బన్ : అదనపు కట్నం తీసుకురమ్మని వేధిస్తున్న భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం యనమదుర్రు గ్రామానికి చెందిన సానబోయిన దుర్గాభవానికి, నవీన్‌కుమార్ 2017లో వివాహమైంది. అప్పట్లో దుర్గాభవాని తల్లిదండ్రులు పసుపుకుంకుమల కింద నవీన్ కుమార్‌కు కొంతసొమ్ము ముట్టజెప్పారు. అయితే ఇటీవల అదనపు కట్నం తీసుకురమ్మని నవీన్‌కుమార్ భార్య దుర్గాభవానిని వేధిస్తుండటంతో ఆమె ఫిర్యాదు మేరకు ఎస్సై డి.మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

పాలకోడేరు: బాత్‌రూమ్‌కి వెళ్లి వస్తానని చెప్పి తన మనమరాలు అదృశ్యమైందని తాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. కొండేపూడికి చెందిన నాగేశ్వరరావుకు ఇంటర్ చదివిన కుమార్తె ఉండగా, ప్రస్తుతం ఇంట్లోనే ఉంటోంది. ఈనెల 19న రాత్రి బాత్‌రూమ్‌కి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. ఆమె కోసం చుట్టుపక్కల వెతికినా కనిపించలేదని తాత మైగాపుల గణపతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

స్పోర్ట్స్ పార్క్‌గా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఆదేశం


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశం చౌక్) : పట్టణంలోని మారుతీ నగర్ మునిసిపల్ పార్క్‌ను మునిసిపల్ స్పోర్ట్స్ పార్క్‌గా తీర్చిదిద్దాలని పురపాలక సంఘం అధికారులను జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం మారుతీ నగర్ మునిసిపల్ పార్క్‌ను కలెక్టరు ఆకస్మికంగా తనిఖీ చేసి అధికారులతో మాట్లాడారు. పురపాలక సంఘం బడ్జెట్‌లో కొంత కేటాయింపుతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతలు సాయంతో సుందరవనంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రజలు ఆరోగ్యం దృష్ట్యా యువతీ, యువకులకు ఆట, పాటలతో పాటు మార్నింగ్ వాక్‌కు ఏర్పాట్లు చేయాలన్నారు. పార్క్‌కు వచ్చే వారికి కనీస సదుపాయాలు కల్పించాలన్నారు. ఎక్కడా శానిటేషన్ లోటు లేకుండా చూడాలని, మంచి నీటి సదుపాయం కల్పించాలన్నారు. జిల్లా కలెక్టరు వెంట పురపాలక సంఘం కమిషనర్ యస్.శివ రామకృష్ణ, ఈఈ విజయ్, ఏసీపీ గౌరు, తదితరులు పాల్గొన్నారు.

సాహస బాలల అవార్డు గ్రహీత వినూత్నకు సన్మానం


భీమవరం డీఎన్నార్ స్కూల్లో వినూత్నను సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : స్థానిక డీఎన్నార్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ పూర్వ విద్యార్థి వినూత్న జాతీయ సాహస బాలల అవార్డు అందుకున్న సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ క్యాంపు కార్యాలయం, డీఎన్నార్ స్కూల్లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఎన్నార్ స్కూల్ జాయింట్ సెక్రటరీ కె.రామకృష్ణంరాజు మాట్లాడుతూ తమ పాఠశాలలో పదవ తరగతి చదివిన వినూత్న జాతీయ సాహస బాలల అవార్డుకు ఎంపిక కావడం తమకు ఎంతో గర్వకారణమన్నారు. అనంతరం వినూత్నకు జ్ఞాపికను బహూకరించి ఘనంగా సత్కరించారు. పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీకుమారి, నిర్మల, జాన్సీ తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందించాలని ఆందోళన


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న చెరుకువాడ రైతులు

ఉండి : చెరుకువాడలో వరి చేలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ గ్రామానికి చెందిన కొందరు రైతులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన తెలిపారు. అనంతరం స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామంలో తోరణాల కోడు, కోలనపల్లి కాలువ తదితర ప్రాంతాలకు వంతుల వారీ విధానంలో వరిచేలకు సరైన సాగునీరు అందడం లేదన్నారు. వరిచేలు చిరుపొట్టదశలో ఉండగా ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎకరాకు రూ.25 వేలు పెట్టుబడులు పెట్టామని, సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని, సాగునీరు అందించాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో మద్దాల గంగయ్య, పడమటి త్రిమూర్తులు, జి.నాగరాజు, పి.సూర్యనారాయణ, హరి, రమేష్ తదితర రైతులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి రవాణా


మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్

పాలకోడేరు: మండలంలోని పలు గ్రామాల్లో మట్టి రవాణా యథేచ్ఛగా సాగుతోంది. లారీలు, ట్రాక్టర్లపై పరిమితికి మించి లోడుతో అతివేగంగా వాహనాలను నడుపుతున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా, అనధికార మట్టి రవాణా వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి భారీగా గండిపడుతోంది. దీనిపై తహసీల్దార్ షేక్ హుస్సేన్‌ను వివరణ కోరగా వీఆర్వోలను పంపించి చర్యలు చేపడతామని బదులిచ్చారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం


ఉండిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయీబ్రాహ్మణులు

ఉండి: అణగారిన వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే తగిన గుర్తింపు లభిస్తుందని నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లువలస వీరవెంకట సత్యనారాయణ, ఉండి మండల అధ్యక్ష, కార్యదర్శులు మల్లువలస అప్పారావు, దుర్గారావు, ముత్యాలపల్లి రాంబాబు అన్నారు. దేవాలయ పాలక మండళ్లలో నాయీబ్రాహ్మణులకు శాశ్వత ప్రాతినిధ్యం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడంతో సోమవారం ఉండిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి నాయీబ్రాహ్మణ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయీబ్రాహ్మణ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో నాయీబ్రాహ్మణ సామాజిక వర్గాన్ని గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత జీవో విడుదల చేయడంతో తామంతా చెప్పలేనంత సంతోషంగా ఉన్నామన్నారు. తామంతా సీఎం వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. నాయీబ్రాహ్మణ ఉద్యోగ సంఘ జిల్లా కార్యదర్శి సీహెచ్ బంగారావు మాట్లాడుతూ టీటీడీ చరిత్రలో నాయీబ్రాహ్మణులకు శాశ్వత ధర్మకర్తగా అవకాశం ఇచ్చారని మళ్లీ అంతటి గొప్ప గౌరవాన్ని సీయం జగన్ ద్వారానే పొందామన్నారు. దేశ చరిత్రలో ఓ సామాజికవర్గానికి శాశ్వత ప్రాతిపదికన నియామకాల కొరకు జీవో జారీ చేయడం చాలా గొప్ప విషయన్నారు. ఇంతటి గౌరవాన్ని నాయీబ్రహ్మణులు పొందడం మరింత సంతోషాన్నిచ్చిందన్నారు. ఇప్పటికే నాయీబ్రాహ్మణులను ఎవరైనా కించపరిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ జీవో జారీ చేశారన్నారు. నాయీబ్రాహ్మణుల పట్ల ఇంతటి అభిమానాన్ని చూపిస్తున్న సీఎం జీవితకాలం భగవంతుడి ఆశీస్సులతో రాష్ట్రాన్ని పాలించాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు మల్లువలస రవీంద్రనాథ్, ముత్యాలపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెదఅమిరంలో న్యాయ విజ్ఞాన సదస్సు

కాళ్ళ : అంతర్జాతీయ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా సోమవారం పెదఅమిరం గ్రామ సచివాలయ వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్యానల్ లాయర్ పులిదిండి అంబేద్కర్ బాలబాలికల రక్షణ పథకం, గృహ చట్టం ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ప్రాధాన్యత వంటి అంశాలపై వివరించారు. న్యాయవాది ఎన్ సుధీర్, సర్పంచ్ డీ సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులంతా సీఎంకు రుణపడి ఉంటారు


బందన పూర్ణచంద్రరావు

భీమవరం అర్బన్ : దేశంలో ఒకే సామాజిక వర్గానికి 4 ఎమ్మెల్సీలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని అగ్ని, వన్నె కుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బందన పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గతంలో ఇదే సామాజిక వర్గానికి చెందిన మాజీమంత్రి మోపిదేవి వెంకటరమణను రాజ్యసభకు పంపిస్తే ప్రస్తుతం మత్స్యకార సామాజిక వర్గంలో వాడ బలిజల్లోని కోల గురువులు, కర్రి శ్రీదేవి, వడ్డీల సామాజిక వర్గం నుంచి జయమంగళ వెంకటరమణ, వన్నె కుల క్షత్రియ నుంచి డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యంలను ఎమ్మెల్సీలకు ఎంపిక చేయడం పట్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ సామాజిక వర్గంపై ఎంత ప్రేమ, అప్యాయతలు ఉన్నాయో తెలుస్తున్నాయన్నారు. గతంలో కుప్పం నియోజకవర్గానికి చెందిన భరత్‌కు ఎమ్మెల్సీ ఇవ్వడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ పట్టం కట్టేవరకు యావత్తు మత్స్యకార వర్గం అండగా ఉంటుందన్నారు.

ఆక్యుపంక్చర్ వైద్యంతో రోగాలు నయం

నరసాపురం రూరల్: మందుల వినియోగం పెరగడం వల్ల రోగులు వారికి సంక్రమించిన రోగంతో పాటు భవిష్యత్తులో ఇతర రోగాల బారినపడే ప్రమాదం ఉందని పలువురు వైద్యులు హెచ్చరిస్తున్న విషయాన్ని గమనించాలని కొవ్వలి ఫౌండేషన్ ట్రస్టు కార్యదర్శి కొండా శ్రీధర్ అన్నారు. నరసాపురం మండలంలోని గొంది గ్రామంలో సోమవారం నిర్వహించిన ఆక్యుపంక్చర్ వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సర్పంచ్ మద్దాల శ్రీకృష్ణ ఆంజనేయులు మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆక్యుపంక్చర్ వైద్యులు అన్నపూర్ణ, అలేఖ్య, అనిత, హరిణి, రామారావు, భవాని కుమార్ సుబ్రహ్మణ్యం, హారిక తదితరులు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు జయలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

పెనుగొండ: వసుధ ఫౌండేషన్, మణిపాల్ ఆసుపత్రి నిర్వహణలో పెనుగొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పెనుగొండలో మంగళవారం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షా శిబిరం నిర్వహించనున్నట్లు పెనుగొండ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొమ్ముల రామకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పెనుగొండ బస్టాండ్ వద్ద టీటీడీ కల్యాణ మండపంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఈ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు ప్రకృతి విపత్తులపై అవగాహన సదస్సు

మొగల్తూరు: ప్రకృతి విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై మంగళవారం కేపీ పాలెం బీచ్‌లో ఎన్ఆర్ఎఫ్ బృందం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ జి.అనిత కుమారి తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు తీర ప్రాంత గ్రామాల ప్రజలు హాజరు కావాలని ఆమె కోరారు.